

వెంకటసుబ్బయ్యకు పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి-రాజంపేట : అన్నమాచార్య విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చిన్నవెంకట సుబ్బయ్య వేలూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయం విఐటిఎపి యూనివర్సిటీ అమరావతి నుండి పిహెచ్‌డి పట్టా పొందినట్లు అన్నమాచార్య విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఇ.సాయిబాబారెడ్డి తెలిపారు. కాపర్, గాడోలినియం, డైస్ప్రోసియం, జిడి-డివై మిశ్రమ మూలకాలతో డోప్ చేసిన సీరియం ఆక్సైడ్ నానోపొడర్ల నిర్మాణ, ఆప్టికల్, అయస్కాంత లక్షణాల సంశ్లేషణ, లక్షణ నిర్ధారణ అనే అంశంపై పరిశోధనకు విఐటిఎపి విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర విభాగపు ప్రొఫెసర్ ఎస్.మధుసూదనరావు మార్గదర్శకత్వం వహించారని పేర్కొన్నారు. ఈ పరిశోధనలో అరుదైన భూమి మూలకాలు, ట్రాన్సిషన్ లోహ ఆక్సైడ్ల గదితాపన వద్ద పారామాగ్నెటిక్ స్వభావం ప్రదర్శిస్తున్నాయని నిర్ధారించారని తెలిపారు. ఈ ఫలితాలు నానోపదార్థాల సాంకేతికత, అయస్కాంత పదార్థాల అభివృద్ధి, ఆధునిక భౌతిక శాస్త్ర పరిశోధనలకు కొత్త మార్గాలను సూచిస్తున్నాయని పేర్కొన్నారు. పిహెచ్‌డి పట్టా సాధించినందుకు జి.చిన్నవెంకట సుబ్బయ్యను అభినందించి ఆయన సాధనపై ప్రశంసలు వ్యక్తం చేసి భవిష్యత్తులో మరిన్ని శాస్త్రీయ విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

రానున్న మూడు రోజులూ అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

రానున్న మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వరదలు, భారీ వర్షాల విపత్తు నిర్వహణపై ఎస్‌పి ధీరజ్ కునుబిల్లితో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజులు అతి భారీ వర్షాలు కురవనుండటంతో జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ ఇచ్చారని, ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖ డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులందరినీ అప్రమత్తంగా ఉండేలా చూడాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలను, పాఠశాలలను గుర్తించి, ఆ ప్రదేశంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ పరిధిలో ఉన్న వాగులు, వంకలు ప్రవాహ తీవ్రతను ముందుగానే గుర్తించి ఎటువంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వీఆర్ఓ, వీఆర్ఏ, ఇతర మండల పంచాయతీ శాఖల అధికారుల పరిధిలో ఆటోలో మైకుల ద్వారా, దండోరా రూపంలో ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. అన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. ఆరోగ్యశాఖ వారిని జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండేలా చూడాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటిని అరికట్టేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌పి ధీరజ్ మాట్లాడుతూ గుంతలు, కాలువలు, వాగులు వంతెనల వద్ద అధికంగా ప్రవహించే ప్రాంతాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవించే అవకాశం ఉన్న జరిగిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ కూడా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లు భావన, చల్లా కళ్యాణి, డిఆర్ఒ మధుసూదన్‌రావు, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, డిపిఒ, వ్యవసాయ శాఖ, డిఎంహెచ్‌ఒ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, పశుసంవర్ధక శాఖ, హార్టికల్చర్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, అగ్నిమాపక, వ్యవసాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లాలో రానున్న మూడు రోజుల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08561-293006) ఏర్పాటు చేసినట్లుగా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని, సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

27, 28న విద్యాలయాలకు సెలవు

జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 27, 28వ తేదీల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వ సెలవులుగా ప్రకటించామని, ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్నీ విధిగా పాటించాలన్నారు.

త్వరలో అందుబాటులోకి రైతుబజార్

- ఎడిఎం త్యాగరాజు



రైతుబజార్ స్థలాన్ని పరిశీలన చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం రైతుల ఆదాయం పెంచడానికి వ్యవసాయ, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి రైతులకు అనుకూలంగా పీలేరులో రైతు బజార్ ఏర్పాటు చేస్తామని ఎడిఎం త్యాగరాజు తెలిపారు. శనివారం పీలేరు పట్టణ వారపు సంతలో రైతుబజారు ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని త్యాగరాజు, పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుబజార్ ఏర్పాటు కోసం రూ.26 లక్షల అంచనాతో అధికారులకు ప్రణాళికలను సిద్ధం చేసి పంపామని తెలిపారు. రైతు బజారును త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. రైతులు పండించిన ఉద్యాన పంటలకు సంబంధించిన దిగుబడులు, కూరగాయలు, పాల ఉత్పత్తులు పంటలకు మంచి ధరలు లభించే విధంగా, నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు అవకాశం కల్పించడానికి, ఈ రైతు బజార్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. త్వరలోనే రైతులకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కలప రవి, గోళ్ళ కిషోర్ నాయుడు, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఇన్‌ఛార్జ్ కార్యదర్శి ఎం.హరినాథ్, భగవాన్, టిడిపి నాయకులు ఖాదర్, కాకులారంపల్లి వెంకటరమణారెడ్డి, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

కడప గడపలో ఎకో టూరిజం!

రూ.కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు

ఆరు ప్రాంతాల్లో పార్కులు, బోటింగ్, అడ్వెంచర్లు

త్వరలో టూరిజం స్పాట్లు అందుబాటులోకి!

కడప జిల్లాలో పర్యాటకాభివృద్ధి చర్చనీయాంశంగా మారింది. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపికి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు పరస్పరం అభివృద్ధికి అడ్డుపడుతున్న నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ పర్యాటకాభివృద్ధిపై దృష్టి సారించింది. జిల్లాలోని విహార కేంద్రాలకు సమీపంలో పచ్చనిచెట్లు, నదీజలాల్లో బోటు విహారాలతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరు ప్రాంతాల్లో పర్యాటకుల విహారానికి విడిది కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల సహకారంతో జిల్లాలోని కడప, బద్వేల్, ప్రొద్దుటూరు, గండికోట, ఒంటిమిట్ట, గువ్వలచెరువు ఘాట్లపైన ఎకో టూరిజానికి ఏర్పాట్లు చేస్తోంది. ఫలితంగా దేశంలోని గోవా, ఊటీ, పాపికొండల తరహా అందమైన పర్యాటక ప్రాంతాలను తలపించేలా తీర్చిదిద్దడంలో భాగంగా అంచెలంచెలుగా తీర్చిదిద్దడంపై దృష్టి సారించింది. ఆయా ప్రాంతాల ప్రత్యేకతల ఆధారంగా ఎకో టూరిజాన్ని అభివృద్ధి పరుస్తున్న నేపథ్యంలో కథనం..



ఎకో టూరిజం పార్కు పనులను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పర్యాటకాభివృద్ధికి చిరునామాగా మారనుంది. జిల్లా అటవీశాఖ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల సహకారంతో పర్యాటకాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలతో సిద్ధమైంది. జిల్లాలోని కడప, ఒంటిమిట్ట, ప్రొద్దుటూరు, బద్వేల్, గండికోట, రాయచోటి ఘాట్‌పై పర్యాటకులను ఆకర్షించే రీతిలో పెద్ద ఎత్తున పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. రూ.రెండు కోట్లతో కడప నగరంలో అడ్వెంచర్ ఏర్పాట్లు, రోప్‌ఫోర్స్, థియేటర్, లాన్స్, కార్తీక వనభోజనాలకు అవసరమైన పచ్చని చెట్లతో కూడిన ఏర్పాట్లు, బటర్‌ఫ్లై గార్డెన్, కల్యాణి ప్రాజెక్టు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రొద్దుటూరులోని రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో రూ.1.20 కోట్లతో వృక్షవనం, రాశీవనం, స్థానిక వృక్షజాతులతో కూడిన ప్లాంటేషన్, పిల్లల ఆటల పార్కులు, లాన్స్, అడ్వెంచర్ గార్డెన్స్ ఏర్పాటు చేస్తోంది. బద్వేల్ సమీపంలోని సెంచూరీ పార్కు సమీపంలో రూ.రెండు కోట్లతో రాశీవనం, నక్షత్ర పార్కు, బయోడైవర్సరీ, 40 రకాల మొక్కలు, ఫైకస్ గార్డెన్, పగోడా నేషనల్ పార్కు, సైన్‌బోర్డులు, స్టోన్‌బెంచ్‌లు, రెస్టారెంట్, ఆర్‌వి ప్లాంటేషన్, బాత్‌రూమ్స్, ఉసిరి వనం, బాంబూ ప్లాంటేషన్ సదుపాయాలను కల్పిస్తోంది. గండికోట పర్యాటక ప్రాజెక్టు సమీపంలోని పొన్నతోట గ్రామ సమీపంలో రూ.రెండు కోట్లతో అడ్వెంచర్ ఆటలు, టెంట్‌లు, పగోడాలు, సైన్‌మ్యా పులు ప్లాంటేషన్, గానుక, ఫైకస్ మొక్కల పెంపకం, పిల్లల ఆటల పరికరాలు, యోగా, రెస్టారెంట్‌లు, ఇతర మొక్కలు, వాకింగ్‌ట్రాక్స్, ఓపెన్‌జిమ్స్ ఏర్పాటు చేస్తోంది. ఒంటిమిట్ట మండలంలో రూ.74 లక్షలతో వనవిహారీ, సోమశిల వెనుకజలాల్లో రిసార్ట్, బయోడైవర్శిటీ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కింద నాలుగు కాటేజ్‌లు, రాత్రి బస సదుపాయాలు కల్పించనుంది. రెస్టారెంట్, పిల్లల ఆటల పరికరాలు, పగోడాలు, రస్తా, ల్యాండ్‌స్కేపింగ్ ఏర్పాటు చేస్తోంది. బోటింగ్ ప్రతిపాదనలు పంపించింది. కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌పైన రూ.40 లక్షల సిఎస్ఆర్ ఫండ్స్, ఎపి బ్రేవరేజెస్ కార్పొరేషన్ సహకారంతో ఎకోరిఫ్రెష్, డ్రికింగ్‌వాటర్, టాయిలెట్స్ వంటి సదుపాయాలను కల్పించనుంది. 2023-24లో రూ.20 లక్షలతో ఎకోటూరిజం అభివృద్ధి పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. నెల నుంచి మూడు నెలల వ్యవధిలో జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రారంభానికి నోచుకునే అవకాశాలు ఉన్నాయి.

ఎకో టూరిజం పనులు చేపట్టాం

ఎకో టూరిజాన్ని అభివృద్ధి పరచడంపై దృష్టి సారించాం. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అనువైన ఆరు ప్రదేశాలను ఎంపిక చేశాం. పర్యాటకాభివృద్ధి పనుల్ని వేగవంతం చేశాం. త్వరలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడంపై దృష్టి సారించాం.

- వినీత్‌కుమార్, డిఎఫ్‌ఒ, కడప.

ప్రకృతి వ్యవసాయంతోనే ఆర్థికాభివృద్ధి : జెడిఎ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

ప్రకృతి వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేయడంతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని జెడిఎ శివనారాయణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజర్ నేషనల్ ఫార్మింగ్ (ఎపిసిఎన్ఎఫ్) ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా డిపిఎం కార్యాలయంలో ఫీల్డ్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ (ఎఫ్ఎంటి) కార్యక్రమం రెండో రోజైన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేయడంతో పాటు ఇతర రైతులతో చేయించాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతమవుతుందని, పంటల నాణ్యత మెరుగవుతుందని చెప్పారు. తక్కువ వ్యయంతో పంటలు సాగు చేసి ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. రైతులు తమ పొలాల్లో 360 రోజులు గ్రీన్ కవరేజ్ సాధించిన సాధించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం డిపిఎం వెంకటమోహన్ మాట్లాడుతూ ఎఫ్ఎంటిలుగా ఎంపికైన ఎపిసిఎన్ కేడర్ సభ్యులు తమ పొలాల్లో గ్రీన్ కవరేజ్ కార్యక్రమంలో భాగంగా పిఎండిఎస్ పద్ధతిని అనుసరించి భూమి సారవంతాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎఫ్ఎమ్‌టిలతోపాటు ఐసిఆర్‌పిలు ఒక్కొక్కరు ఐదుగురు రైతులు తీసుకొని వారి పొలాల్లో కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పిఎండిఎస్ వేయించి ఎటిఎం, ఏ గ్రేడ్ మోడల్‌లను అమలు చేయించి మంచి దిగుబడులను సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అదనంగా 65 పోలింగ్ బూత్‌లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గంలో గతంలో ఉన్న పోలింగ్ బూతులకు అదనంగా మరో 65 బూత్‌లు కొత్తగా ఏర్పాటు చేశామని, కొత్తగా ఓటర్ల జాబితా పరిశీలించి అభిప్రాయాలు వెల్లడించాలని సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి కోరారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, బిఎల్‌ఒలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె టౌన్, రూరల్ ప్రాంతంలో నివసించే వారికి వారు నివసించే ప్రాంతంలో కాకుండా గతంలో నివసించే ప్రాంతంలో ఓట్లు ఉన్నాయని, దానిపై సమగ్ర పరిశీలన చేసి వారు నివసించే చోటే ఓటు హక్కు కల్పించాలని సూచించారు. సమావేశానికి కాంగ్రెస్, టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి, సిపిఐ, బిఎస్‌పి ఇతర పార్టీల నాయకులు హాజరయ్యారు.

గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా షంషీర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘం నూతన కార్యవర్గం శనివారం కొలువుదీరింది. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్నికల అధికారి కె.రాజశేఖర్‌రెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎస్.రెడ్డి షంషీర్, ఉపాధ్యక్షుడిగా ఎన్.రెడ్డెప్ప, కార్యదర్శిగా బి.మహేష్ కుమార్, సభ్యులుగా చల్లా చలపతి, శివానందర్ నాయక్, నరేష్, శివాజీ రాయల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా షంషీర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆశీస్సులతో మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. ఈ పదవికి తాను ఎంపిక కావడానికి సహకరించిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్.రెడ్డి షంషీర్‌ను టిడిపి సీనియర్ నాయకులు, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ నాదెళ్ల శివన్న పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కె.ప్రవీణ్ కుమార్, రోషన్ జమీర్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట: ఈ నెల 26వ తేదీన రాయచోటిలో నిర్వహించే మున్సిపల్ కార్మికుల రెండవ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ కోరారు. శనివారం ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఇఎస్ఐ అమలు చేయాలని చెప్పారు. కార్మికుల ప్రధాన సమస్యలపై మహాసభలో చర్చిస్తారని తెలిపారు. మహాసభకు జిల్లాలోని కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు కె.ప్రసాద్, సి.హెచ్.ఓబయ్య, ఎం.రమణ పాల్గొన్నారు.

పట్టు చీరలకు బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి పాలనలో చేనేత రంగం మహర్దశను సంతరించుకుంటోందని, నీరుగట్టువారిపల్లె పట్టుచీరలకు బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. భారత ప్రభుత్వం చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ 2023-24 సంవత్సరానికిగాను 4 స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పథకంలో మదనపల్లి నియోజకవర్గంలోని కోళ్లబైలు, రాజానగర్, నీరుగట్టువారిపల్లి, మదనపల్లి రూరల్ ప్రాంతాలకు చేనేత మగ్గాలు, పరికరాలు మంజూరు కావడంతో శనివారం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో జిల్లా చేనేత, జౌళి శాఖాధికారి ఆర్.పవన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులైన చేనేత కార్మికులకు మగ్గాలు, మగ్గం పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగంపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తున్నారన్నారు. నీరుగట్టువారిపల్లెలో 20వేల మంది చేనేత కార్మికులు నివసిస్తుండగా వారి శ్రేయస్సు కోసం తాము పనిచేస్తున్నామన్నారు. గత వైసిపి పాలనలో చేనేత కార్మికులను, చేనేత రంగాన్ని విస్మరించడంతో అనేకమంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత రంగం పూర్వవైభవానికి చర్యలు చేపట్టిందన్నారు. త్వరలోనే 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులకు పెన్షన్లు మంజూరు చేస్తామని, అర్హులైన వారికి రెండున్నర సెంటు స్థలాలు మంజూరు చేసి, ముద్ర రుణాలు అందిస్తామన్నారు. త్వరలో ముఖ్యమంత్రి మదనపల్లి పర్యటన నేపథ్యంలో నీరుగట్టుట్టువారిపల్లి పట్టుచీరలకు బ్రాండ్ ఇమేజ్ తీసుకొస్తామన్నారు. అనంతరం జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆర్.పవన్‌కుమార్‌రెడ్డి 4 క్లస్టర్ల మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.580.14 లక్షలని, ఈ పథకం క్రింద మోటరైజెడ్ పర్న వెల్డింగ్ డబ్బా మిషన్లు, గుంత మగ్గాలు, ఫ్రేం మగ్గాలు, 240 హుక్స్ జాక్ కార్డు, ఎలక్ట్రానిక్ జాకార్డు మెషిన్, మోటరుతో కూడిన లిఫ్టింగ్ మిషన్ 3 లివర్, 2 లివర్ పరికరాలు మొదలైనవి చేనేత కార్మికులకు అందజేస్తున్నామన్నారు. ఈ పథకం కింద చేనేత లబ్ధిదారుల నుండి వారు కోరిన పరికరాల మొత్తం విలువలో 10 శాతం మొత్తాన్ని వారి వాటా కింద చెల్లించాలని, మిగిలిన 90 శాతం మొత్తాని కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. ఇందులో మొదటి విడతగా 425 మంది క్లస్టర్ సభ్యులకు చేనేత మగ్గాలు, ఇతర మగ్గాలు సంబంధిత పరికరాలను పంపిణీ చేయుడానికిగాను రూ.228.522 లక్షల మంజూరయ్యాయన్నారు. తద్వారా మొదటి విడతలో మంజూరైన మొత్తం పరికరాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయబడుతాయని, అర్హులైన 30 మంది చేనేత కార్మికులకు 30 వర్క్ షెడ్డులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఒక్కొక్క వర్క్ షెడ్డుకు రూ.1.20 లక్షలు మంజూరు కాగా ఆ మొత్తం నిధులను కేంద్ర ప్రభుత్వ వాటా నుండి చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మోడెం సిద్ధప్ప, రామిశెట్టి ఆంజనేయులు, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రామిశెట్టి కృష్ణ, రామిశెట్టి నీలకంఠ, నవీన్ చౌదరి, షంషీర్, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, బీదం గురునాథ్ యాదవ్, 5వ వార్డు కొప్పల హరినాథ్, రాగినేని రఘుపతి నాయుడు, చేనేత విభాగం నాయకులు వెంకటరమణ, ఎంపిడిఒ తాజ్ మాస్రూర్, విఆర్ఒ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శులు మంజుల, గిరిధర్ నాయక్, పెద్దఎత్తున చేనేత కార్మికులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి : డిఇఒ



మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

అన్ని రకాల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని డైట్ కళాశాలలో శనివారం నుంచి ప్రారంభమైన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు ఏడు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం(స్కౌట్స్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందని పేర్కొన్నారు. స్కౌట్‌లో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను ఈ నెల 31లోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అకాడమిక్ కేలెండర్ ప్రకారం పాఠశాలల్లో స్కౌట్ కార్యకలాపాలను నిర్వహించాలని పేర్కొన్నారు. స్కౌట్ సర్టిఫికెట్స్ కలవారికి విద్యా ఉద్యోగ అవకాశాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యూనిఫామ్‌తో పాటు 32 జతల స్కౌట్ యూనిఫామ్‌ను కూడా పంపిణీ చేయడానికి ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తామని పేర్కొన్నారు. యూనిట్ లీడర్లకు గౌరవ వేతనం అందించేందుకు, వారికి బదిలీలలో ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, ఎల్‌ఒసిలు జయరాం, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, శకుంతల, అబ్జర్వర్ కమల కన్నన్, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్స్ రమణయ్య, లక్ష్మీకర్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, యువ ఆపదమిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, స్కౌట్ జిల్లా కోశాధికారి మార్ల ఓబుల్ రెడ్డి, జిల్లాలోని 160 మంది అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

జిఎన్ఎస్ఎస్ రెండవ దశ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి-రాజంపేట

గాలేరు-నగరి కడప నుండి రైల్వేకోడూరు వరకు 2వ దశ నిర్మాణానికి నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని ఆలోచన పరుల వేదిక సభ్యులు ఎ.బి.వెంకటేశ్వరరావు, రైతు సేవా సంస్థ అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్, జలవనరులు, సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, సెంటర్ ఫర్ లిబర్టీ అధ్యక్షులు నలమోతు చక్రవర్తిలతో కూడిన ప్రతినిధి బృందం తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1988లో గాలేరు నగరి సుజల స్రవంతికి శంకుస్థాపన చేశారని, అది నేటికీ 37 సంవత్సరాలైనా పాలకుల నిర్లక్ష్యం కారణంగా ముందుకు సాగడం లేదని, రాయలసీమ ప్రాంతంలో ఉన్నటువంటి ఈ గాలేరు నగరి సుజల స్రవంతికి ఈ ప్రాంతం నుంచి ముఖ్యంగా చిత్తూరు, కడప జిల్లాల నుండి ముఖ్యమంత్రులు అయినప్పటికీ ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం చాలా దుర్మార్గమని, నిత్యం రైతుల ప్రభుత్వం రైతులకు మేలు చేస్తామని చెప్పడం తప్పితే ఏ ఒక్కటి రైతులకు అందించినటువంటి పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎన్.ఈశ్వరయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్ర, నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

వర్షార్పణం!

ప్రజా'దృష్టి'

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ధాటికి కడప, అన్నమయ్య జిల్లాల రైతాంగం అతలాకుతలమైంది. ఐదు రోజులుగా కురిసిన వర్షాల ధాటికి ఆయా జిల్లాల పరిధిలో 7,145 ఎకరాల్లో సాగు చేసిన వరి, వేరుశనగ, జొన్న, కంది, మినుము, పత్తి పంటలు వర్షార్పణమయ్యాయి. జిల్లాలో అసమతుల్య వాతావరణ పరిస్థితి తలెత్తినప్పుడల్లా రైతులు తీవ్రంగా నష్టపోతున్న సంగతి తెలిసిందే. దేశానికి అన్నం పెట్టే అన్నదాతను గాలికి వదిలేసి అస్త్రసన్యాసం చేయడం పాలకులకు పరిపాటిగా మారింది. డబ్ల్యూటిఒ వంటి అంతర్జాతీయ వాణిజ్య సంస్థల మాటున దాక్కుని అమెరికా తరహాలో రైతులకు సబ్సిడీలు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల నుంచి వచ్చిపడుతున్న చవకైన సరుకుల కారణంగా జిల్లా రైతులు ఆత్మహత్యల పావుతున్న దుస్థితి దాపురించింది. ఇంతటితో ఆగకుండా జిల్లా రైతులకు చెందిన 18 వేల ఎకరాల నుంచి 40 వేల ఎకరాలను అభివృద్ధి పేరుతో పునరుత్పాదక ఇంధన వనరుల పేరుతో సోలార్ తదితర కార్పొరేట్ కంపెనీలకు దారాదత్తం చేయడం ఏమిటో ఏలికలే సమాధానం చెప్పాలి. ఒకవైపు అతివృష్టి, అనావృష్టి రూపంలో మేఘుడు, మరోవైపు మతతత్వ కార్పొరేట్లు నిరంకుశత్వం అభివృద్ధి పేరుతో కూడబలుక్కుని బక్కచిక్కిన బడుగు రైతును పీక్కుతినడం చూపరులను నిర్ఘాంతపరుస్తోంది. జిల్లా అధికార యంత్రాంగం రైతులకు సబ్సిడీలు, పరిహారం చెల్లింపులకు దశాబ్దాల తరబడి దాగుడుమూతలు ఆడుతున్న వైచిత్యం కనిపిస్తోంది. రెవెన్యూ తప్పిదాల కారణంగా సన్న, చిన్నకారు రైతులకు సంక్షేమ పథకాలు సైతం అందని దుస్థితి నెలకొంది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల, కలసపాడు మండలాలకు చెందిన రైతుల పేరుతో పదుల సంఖ్యలో ఎకరాలు ఆన్‌లైన్‌లో చూపిన కారణంగా సామాజిక పింఛను పథకం నుంచి దూరం చేస్తున్న ఘటనలు కొల్లలు. రెవెన్యూ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలో జిల్లా సర్వోన్నతాధికారి సెలవివ్వాలి మరి. అర్హుడై ఉండి సంక్షేమానికి నోచుకోని ఎందరో అర్హులకు ఎలా న్యాయం చేయాలో ఆలోచించాలి. కడప జిల్లాలో పాఠశాలల క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారు. స్పోర్ట్స్ యంత్రాంగం స్కూల్‌గేమ్స్ పట్ల అవగాహన కల్పించాలి. క్రీడల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులు పోటీలకు హాజరు కావడానికి అవకాశం ఉంది. ఫలితంగా మెరికలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అటువంటి మెరికలను సానబెడితే దేశానికి ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు లభించే అవకాశాలు ఉన్నాయనే సంగతిని గ్రహించాలి. అమెరికా, చైనా, ఆస్ట్రేలియా దేశాల తరహాలో మెరుగైన క్రీడా పద్ధతులను పాటించాలి. పారదర్శక విధానాల ద్వారా యువత మానసికంగా, శారీరకంగా బలీయంగా తయారు కాగలదని గ్రహించాలి. ప్రస్తుత సంక్షుభిత ప్రపంచంలో క్రీడల ద్వారా సుహృద్భావ వాతావరణం నెలకొనే అవకాశం ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రామాపురం : భోజనాలను పరిశీలిస్తున్న జడ్జి సిహెచ్.భరత్

పోక్సో చట్టంపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి-రామాపురం

బాలికలు పోక్సో, మహిళా చట్టాలు, హక్కులపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సిహెచ్ భరత్ పేర్కొన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఎవరి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. బాలికలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. భోజనం, మరుగుదొడ్లను పరిశీలించారు. భోజనంలో నాణ్యతను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఉపాధ్యాయులు బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. పిల్లలు బయటికి పంపేటప్పుడు తల్లిదండ్రులు పూర్తి వివరాలు తెలుసుకొని పంపించాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పుష్పలత, వార్డెన్,కోర్టు కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లె :** విద్యార్థి స్థాయిలో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కమిటీ చైర్మన్, జడ్జి సిహెచ్ భరత్ కుమార్ న్యాయమూర్తి పేర్కొన్నారు. శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో యువత చెడు మార్గం బాటపడుతున్నారని వారి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అసిస్టెంట్ రోడ్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ అజయ్‌కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడపాలంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని వాహనం నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని హెల్మెట్ తప్పక ధరించాలని వాహనానికి ఇన్సూరెన్స్ తప్పక చేయించుకోవాలని సూచించారు. ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరం గా ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. కళా శాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఏది చెడు ఏదో తెలుసుకుని అడుగు వేయాలని, క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిన్న కృష్ణయ్య, సిద్దయ్య, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సివిల్ జడ్జి హేమసుందర్ అన్నారు. పట్టణంలోని రంగనాయకులపేటలో రాయలసీమ విజ్ఞాన అకాడమీలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, బాలిక చట్టాలు, రోడ్డు భద్రత విషయాలపైన తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి చట్టాల పైన విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాయలసీమ అకాడమీ కరస్పాండెంట్ కె.శ్రావణి,స్కూల్ ఇన్‌ఛార్జి భరత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జస్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి

ప్రజాశక్తి-బి.కొత్తకోట : స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువు తున్న విద్యార్థి ఎ.జస్వంత్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో నిమ్మనపల్లిలో జరిగిన కబడ్డీ పోటీల్లో పాల్గొని సత్తాచాటి పల్నాడు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. తమ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జస్వంత్‌ను పీడీ జి.వెంకట శివ,ప్రసాద్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



జలహారతినిస్తున్న గ్రామస్తులు

పెద్దచెరువుకు వెలిగల్లు నీరు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని హసనాపురం పెద్దచెరువుకు వెలిగల్లు ప్రాజెక్ట్ నీరు రావడంత ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కొంతకాలంగా వెలిగల్లు నీరు పెద్ద చెరువుకు వస్తాయని ఎంతో ఆశతో ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలేదన్నారు. రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో ఈ ఏడాది వెలు గులు ప్రాజెక్టు నీరు హసనాపురం పెద్ద చెరువు చేరుకున్నాయని తెలిపారు. మండల యువ నాయకుడు పప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు, గ్రామస్తులు, టిడిపి నాయకులు జలహా రతి ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
Arbitration O.P.No. 02 of 2021
M.Hanumantha Naiak ...Petitioner
Vs
M/s Shriram City Union Finance Ltd., Having Office at Piler, Rep. by GPA Holder & Others. ...Respondents
2వ&3వ రెస్పాండెంట్ నకు నోటీసు
2వ రెస్పాండెంట్:
2. A.Siva Reddy, S/o A.Basi Reddy, working as Chitan agencies, Chenna reddipalli Sai Chetan spares & Services, Bhaskarpeta, Chinnagottigallu Mandal, Tirupati District, residing at D.No.2-324/3, Chinnaredivaripalli Village & Post, Piler Mandal-517214, Annamayya District.
3వ రెస్పాండెంట్:
3. A.Sailaja Mamatha, W/o A.Siva Reddy, R/o residing at D.No.2-324/3, Chinnaredivaripalli Village & Post, Piler Mandal-517 214, Chittoor District.
పై పిటిషనర్ దాఖలు చేసిన పై పిటిషన్ నందు మీ హాజరు నిమిత్తమై పై కేసును 11.11.2025వ తేదీన వాయిదా వేసివున్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని పై కోర్టులో 11.11.2025 తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియజేయడమైనది.
//By Order of Court//
కె.సుధాకర్ రెడ్డి,
పి.వి.రమణారెడ్డి,
ఎన్. దినకర్,
న్యాయవాదులు, పీలేరు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ దారుణం : నిస్సార్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వ వైద్య కళాశాలలు పిపిపి విధానంతో ప్రయివేటీకరణ చేయడాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తోందని మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ అన్నారు. శనివారం మండలంలో పర్యటించిన ఆయనకు మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసుల రెడ్డి, మాజీ మండలాధ్యక్షులు ఆర్.ఐ రమణారెడ్డి, నరసింహులు, రెడ్డిశేఖర్‌రెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాచవేటివారిపల్లెలోని ఎగువమాచిరెడ్డిగారిపల్లె, రెడ్డివారిపల్లె, బండ్లపైపల్లె, కొండయ్యగారిపల్లెలో రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను, ప్రజలపై పడుతున్న భారాలను ప్రజలకు వివరించారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్ అధికారం చేపట్టకముందు రాష్ట్రంలో కేవలం 12 ప్రభుత్వ వైద్య కళాశాలలో మాత్రమే ఉండేవన్నారు. వైసిపి ప్రభుత్వంలో మాజీ సిఎం జగన్ మరో 16 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకువచ్చి నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ పనులు మూలన పడ్డాయన్నారు. ఇప్పుడు ఏకంగా ఆ ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతలను కూడా పిపిపి విధానంతో అభివృద్ధి చేస్తానంటూ సాకు చూపిస్తూ ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించి పూర్తిగా వాటి బాధ్యతలను ప్రయివేట్ పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజులలో పేదలకు అందాల్సిన ఉచిత వైద్యం సదుపాయాలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కూడా డబ్బులు ఇచ్చి వైద్య సేవలు కొనుక్కోవలసిన అవసరం ఏర్పడుతుందని వివరించారు. మెడికల్ కళాశాలలను ప్రయివేట్ పరం కాకుండా అడ్డుకునేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపటి, 28న రాష్ట్ర గవర్నర్ కు అందించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ వైద్యం ప్రయివేట్ పరం కాకుండా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నరేంద్ర రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, శశి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఖాదర్బాషా, రెడ్డి వేముల, రాజగోపాల్, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



రెడ్డివారిపల్లెలో సంతకాలు సేకరిస్తున్న నిస్సార్ అహ్మద్

చెరువులు, తెగిన ఆనకట్టల పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్ఇ వెంకట్రామయ్య

ప్రజాశక్తి-పుల్లంపేట

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో చెరువులు, తెగిన ఆనకట్టలను శనివారం ఎస్ఇ వెంకట్రామయ్య పరిశీలించారు. పుల్లంగేరుకు సంబంధించిన ఆనకట్టలు నూకనపల్లి, ఎగువరెడ్డిపల్లి దగ్గర పరిశీ లించి తాత్కాలిక మరమ్మతులు చేయించాలని ఇరిగేషన్ ఎఇఇ నాగేంద్ర నాయక్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ నీటిపారుదలకు సంబంధించి కలెక్టర్ నిశాంత్‌కుమార్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నీటిని వృధా కాకుండా ప్రతి చెరువు నింపే బాధ్యత తీసుకుంటామని, ఆనకట్టలు తాత్కాలిక మరమ్మతులే కాకుండా వీటిని త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. అనంత సముద్రం ,వత్తలూరు, రంగంపల్లి, రెడ్డిపల్లి, కొత్తపేట కోనమ్మ చెరువులు నిండి ప్రతి సంవత్సరం రైతులకు సస్యశ్యామలంగా నీరు ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, వెంకటసుబ్బయ్య యాదవ్, సింగమాల రెడ్డయ్యరెడ్డి, పోలు ప్రేమకుమార్, వర్ధనగారి ప్రసాద్, ప్రజలు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని కసిరెడ్డిగారి పంచాయతీ సుగాలి బిడికి సమీపంలో ఉన్న గుండ్లకుంట చెరువు అలుగులను శనివారం తహశీల్దార్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పాలకొండలోని వర్షపు నీరు అడవి సమీపంలో ఉన్న చెరువుకు చేరడంతో చెరువు నిండిందని తెలిపారు. చెరువు అలుగులు వద్ద పెద్ద పెద్ద మట్టి కుప్పలు ఉండడంతో చెరువు తెగే ప్రమాదం ఏర్పడుతుందని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ఇచ్చారని తెలిపారు. అలుగుల వద్ద ఉన్న మట్టి కుప్పలను జెసిపి సహాయంతో తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వాసుదేవరెడ్డి, ఇరిగేషన్ ఎఇ మహబూబ్ బాష, ఆర్ఆర్ఐ సమద్ ఖాన్, విఆర్ఒ రాధిక, గ్రామ సర్వేయర్ బాబ్జాన్ పాల్గొన్నారు.



గుండ్ల కుంటచెరువు అలుగులను పరిశీలిస్తున్న తహశీల్దార్

సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ మల్లికార్జున స్వామి

ప్రజాశక్తి-సుండుపల్లి



మండలంలోని అన్ని గ్రామా పంచాయతీలో ప్రజలు సీజన్ వ్యాధుల పైన జాగ్రత్తగా పాటించాలి రాచపల్లి మల్లి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మల్లికార్జునస్వామి పేర్కొన్నారు. ఎక్కువగా వర్షాలు పడడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కాలుష్యం వల్ల విష జ్వరాలు వ్యాప్తి చెందే ప్రమాదముందని పేర్కొన్నారు. దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ వంటి వ్యాధులు కలిగిస్తాయన్నారు. నీరు కలుషితం కావడం వల్ల డయేరియా, టైఫాయిడ్ జ్వరాలు వస్తాయని పేర్కొన్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. తాగునీటిని వేడి చేసుకొని తాగాలని, ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతల గోర్లను శుభ్రంగా కటింగ్ చేసుకోవాలని భోజనానికి ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కో వాలని సూచించారు. ఆహారాన్ని నిల్వ ఉంచుకోకుండా వీలైనంత వరకు వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలన్నారు. దోమలు బారి నుంచి రక్షించుకు నేందుకు దోమ తెరలను వాడాలని, వేప ఆకు పొగ వేసుకోవాలని, ఇంటిలోని కిటికీలకు మెస్ కొట్టించుకోవాలని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా డెంగీ జ్వరాలు కూడా వస్తున్నాయని మూడురోజులకు మించి జ్వరం వస్తుంటే తప్పకుండా ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వహిస్తూ ప్రాణానికే ప్రమాదంవాటిల్లే అవకాశముందని చెప్పారు. వర్షాలకు జాగ్రత్తగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.



నిలిచిపోయిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి

ఇళ్ల చుట్టూ చేరిన నీరు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పరిశీలించిన ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డి మల్లె మేజర్ గ్రామపంచా యతీ భారత్ గ్యాస్ సమీపంలోని గణపతి నగర్, విద్యానగర్‌లో ఈ మధ్య కురిసిన వర్షాలకు ఇళ్ల చుట్టూ నీరు చేరి ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి సంఘ టనా స్థలికి చేరుకొని సమస్యను రాజంపేట సబ్ కలెక్టర్ భావన దృష్టికి తీసు కువెళ్లారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపిడిఒ కెఆర్ఎం ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ సునీల్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ సురేష్, నీరు ఉన్న ప్రాంతానికి చేరుకొని తొలగించే ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అందుకు ఎంపీ నిధులను మంజూరు చేయిస్తామని హామీనిచ్చారు. బాధిత ప్రజలు మాట్లాడుతూ కాలువల ఆక్రమణల వల్లే భారీ వర్షాలు పడిన ప్రతిసారి తాము నీటి వలన పలు రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మాకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-కలికిరి

పచ్చదనంతోనే సమతుల్యమైన పర్యావరణం ఉంటుందని ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వి.హసీ నా తెలిపారు. ఎన్‌జిసి ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని స్థానిక ఇంద్రమ్మ కాలనీలోని జడ్‌పి హైస్కూల్‌లో చేపట్టారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించ డం, పాఠశాల పరిసరాలను హరితవనంలా మార్చ డమే ప్రధాన లక్ష్యమన్నారు. పూలు, పండ్ల చెట్లు, నీడనిచ్చే మొక్కలు నాటి వాటికి నీరు పోసి సంరక్షణ బాధ్య తలు స్వీకరించారు. ప్రతి విద్యార్థి 'ఒక విద్యార్థి ఒక మొక్క' అనే నినాదాన్ని నెర వేర్చే దిశగా ముందుకు సాగాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా హసీనా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని ప్రేమగా సంరక్షిస్తే మన పరిసరాలు మరింత పచ్చగా, పరిశుభ్రంగా మారుతాయన్నారు. పచ్చదనమే ప్రగతికి ప్రతీకలని పేర్కొన్నారు. ఎన్‌జిసి కో-ఆర్డినే టర్ సుజాత మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ అనేది కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ఫిజికల్ డైరె క్టర్ టి.రెడ్డి మోహన్‌రెడ్డి కృషి విశేషమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యు లు పి.సబిత, ఎం.అశోక్ నాయక్, కరుణకుమారి, ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్, బోధనా సిబ్బంది, ఎన్‌జిసి సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు:**మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సబియా సుల్తానా తెలిపారు. పీలేరు రేంజ్ అటవీ క్షేత్రాధికారి జయప్రసాద్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని ముడుపుల వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం రోజు రోజుకూ పెరుగుతున్న కారణంగా అతివృష్టి, అనావృష్టి వంటి సమస్యలు ఉత్పన్న మవుతు న్నాయన్నారు. ఈ ప్రభావం దేశ ప్రజల జీవన విధానంపై ప్రతికూల ప్రభావాన్ని చూపు తోందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు తరచూ ఇలాంటి మొక్కల నాటే కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో అటవీ శాఖ బీట్ అధికారులు రెడ్డి ఆసియా, జగదీష్, చంద్రకళ, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.



కలికిరి : మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

IN THE COURT OF THE PRL. JUNIOR CIVIL JUDGE OF MADANAPALLE
O.S.No. 439/24
N.Vijayamma. ...Plaintiff
Vs
P.Rama Krishna. ...Defendant
SUMMONS TO THE DEFENDANT
P.Rama Krishna, S/o P.N.Babu, Sipoyveedi, Madanapalle.
Please take notice that the above plaintiff filed the above suit for recovery of amount against you and the suit is posted to 25.11.2025 for your appearance by 10.30 A.M. either in person or through an advocate, and if you fails to appear the matter will be decided exparty.
//By Order of the Court//
SURABHI
RAMA GOPAL RAO
Advocate/Notary/Receiver
MADANAPALLE.

కాలువ ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి-నందలూరు : మండలంలోని అంబేద్కర్ కూడలి, బస్టాండ్ నుండి నీలి పల్లె వరకు ఉన్న కాలువ ఆక్రమణదారులకు ఉన్నతాధికారి ఆదేశానుసారం నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. సంబంధిత వ్యక్తులు కాలువ ఆక్రమణ స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేనిపక్షంలో అధికారుల ఆధ్వర్యంలో కాలువల ఆక్రమణ తొలగిస్తామని నోటీసు ద్వారా తెలిపారు. ప్రస్తుతం గౌతమ్ నగర్, నీలిపల్లి రోడ్డు, భారత్ గ్యాస్ ప్రాంతాలలో వరదనీడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నీరు వెళ్లే రాజంపేట పాత రోడ్డు కడప - చెన్నై ప్రధాన రహదారిలో ఉన్న నీటి తూములను మూసి వేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ , రెవెన్యూ, ప్రధాన రహదారి అధికారులు స్పందించాలనానరు.



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న జనసేన నాయకులు

దెబ్బతిన్న గృహాల పరిశీలన

ప్రజాశక్తి-సుండుపల్లి

ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలో కూలిన, దెబ్బతిన్న గృహాలను జనసేన నాయకులు రాంశ్రీనివాస్ పరిశీలించారు. మండల కేంద్రం సుండుపల్లిలోని అఖంపల్లెలో సుమారు 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్పిడి వాసు, నాగరాణి దంపతులు, వారి పిల్లలు నిద్రస్తున్న సమయంలో వేకువజామున ఒక్కసారిగా ఇంటి పైకప్పు కూలిపోవడం భాదరమన్నారు. దాదాపుగా 95 శాతం ఆ ఇల్లు దెబ్బతిందని చెప్పారు. అదే గ్రామానికి చెందిన కత్తి సుధాకర్, ముద్దిన బీమా , కత్తి లలితా, ముద్దిన సుజాత , కత్తి సిద్దయ్య, ముద్దిన లక్ష్మీదేవి, సప్పిడి వెంకటేష్, సప్పిడి వెంకటరమణ, ముద్దిన మల్లికార్జున , ముద్దిన కొండయ్య, కత్తి శివ నివాసమున్న గృహాలు కూడా దెబ్బ తిన్నాయని చెప్పారు. గృహాలు దెబ్బతిన్న బాధితులను ఆదుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తరుపున బాధితులకు అండగా ఉండి సహాయ, సహాకారం అందిస్తామని చెప్పారు. రాంశ్రీనివాస్ వెంట జనసైనికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామాపురం

జీవితంలో చివరి అంకంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషాన్ని ఇచ్చిందని దాతలు ఎరగనేని కిరణ్‌కుమార్‌రెడ్డి, భావన దంపతులు పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ లోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శనివారం వారు తమ కుమార్తె మాన్విక రెడ్డి మొదటి పుట్టినరోజు సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. తమకు ఈ అవకాశం కల్పించిన రాయచోటి టౌన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుపులేటి శ్యామ్, రీజనల్ మేనేజర్ మహమ్మద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ అభాగ్యులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ సేవా గుణంతో అనాథలకు అండగా ఉండి తమకు తోచిన సాయం చేయాలన్నారు. దాతల కుటుంబ సభ్యులు, ప్రేమాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కలికిరి ఎంఇఒ-1గా సురేష్ బాధ్యతలు స్వీకరణ


ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మండల విద్యాశాఖ అధికారి-1 గా ఆర్.సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రభుత్వ ఉన్నత పాఠశాల పుత్తూరులో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచే స్తున్నారు. ఇటీవల ఆయననను ఎఫ్ఎసి, ఎంఇఒ-1గా విద్యాశాఖ అధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఎంఇఒ-2 నాగార్జున, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది ఆయనకు శుభాకాం క్షలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సురేష్‌ను ఎపిటిఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కుమార్‌యాదవ్, ఉపాధ్యాయులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, మురాషావలి, సిఆర్ఎంటి సభ్యులు సురేష్, భాస్కర, ఆది, హరి, రియాజ్, జగదీష్, ఎంఐఎస్ అరుణ పాల్గొన్నారు.

ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్ అన్నారు. ఈ సందర్భంగా లతీఫ్ మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రయివేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదని,పదవ తరగతి విద్యార్థులకు వారి పాఠశాల వ్యాపారం కోసం మార్కుల ఎక్కువ రావాలని మన వ్యాపారం అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులను చదువు పేరుతో ఒత్తిడి చేస్తూ సమయానికి మించి పాఠశాలలను నడుపుతున్నారు. ప్రభుత్వ సమయం కంటే ఎక్కువ నిర్వహిస్తున్నారని పలుమార్లు ఎంఇఒ దృష్టికి తీసుకుని పోయినా కూడా ఎటువంటి చర్యలు లేకపోవడం వల్ల విద్యార్థులు మానసికగా ఇబ్బందులు పడు తున్నారన్నారు. తక్షణమే ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. అనం తరం తహశీల్దార్ అమర్నాథ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సుమంత్,అభినయ్ కుమార్, భరత్, అభిషేక్, చరణ్, నిఖిల్, యశ్వంత్, జగన్, బాలాజీ పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రైం కార్నర్



బాధితురాలికి బంగారు గొలుసును అప్పగిస్తున్న సిఐ రాజారెడ్డి

బంగారు గొలుసు అప్పగింత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని టైటానిక్ ఎగ్జిబిషన్‌లో పోగొట్టుకున్న బంగారు గొలుసును మహిళకు టూటౌన్ సిఐ రాజారెడ్డి అప్పగించారు. పోలీసు వివరాల మేరకు.. కురబలరకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన తరిగొండ శ్రీనివాసులు, ప్రమీల దంపతులు రెండు రోజుల క్రితం పట్టణంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో నడుస్తున్న టైటానిక్ ఎగ్జిబిషన్‌కు వచ్చారు. రూ.లక్ష విలువ గల సుమారు 10 గ్రాముల బంగారు గొలుసు ఎగ్జిబిషన్‌లో ప్రమీల పోగొట్టుకుంది. బాధితురాలు వెంటనే రెండవ పట్టణ సిఐ రాజారెడ్డికి ఫిర్యాదు చేయడంతో స్పందించిన సిఐ మహిళ జార విడచుకున్న 10 గ్రాముల బంగారు చైను ను ఆ ప్రదేశంలో టెక్నికల్ ఆధారాల ద్వారా స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాధితురాలిని స్టేషన్‌కు పిలిపించి అప్పగించారు. ప్రమీల కుటుంబ సభ్యులు సిఐ రాజారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో స్పందించి బాధితురాలికి న్యాయం చేసిన సిఐని పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో సిటియంరోడ్డులో మదనపల్లె వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యంలోని కొత్తవారిపల్లె వద్ద రోడ్డు పక్కన చెట్టును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని వెంటనే 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు బాధితుని వివరాలు సేకరిస్తుస్తున్నట్లు తెలిపారు.